క్లుప్తంగా

భూ సమస్యలు పరిష్కరించండి



సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ కామేశ్వరరావు

వీరఘట్టం: గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలపై సర్వే టీమ్ దృష్టి సారించి సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ ఏఎస్ కామేశ్వరరావు సూచించారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలు, సర్వే టీమ్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాయింట్ ఎల్‌పీఎం ఖాతాలు, పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్లను వెంటనే క్లియర్ చేయాలని సూచించారు. సచివాలయాల పరిధిలోనే సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు.

ఎంఎల్‌ఎస్ గొడౌన్ పరిశీలన



గొడౌన్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వైశాలి

పాలకొండ: పట్టణంలోని పౌరసరఫరాల శాఖ గొడౌన్‌ను పార్వతీపురం సబ్‌కలెక్టర్ ఆర్. వైశాలి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి, నిల్వలను సరిపోల్చారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. సరుకుల సరఫరాలో తేడాలొస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో గొడౌన్ ఇన్‌చార్జ్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయండి



పీఓకు పుష్పగుచ్ఛం ఇస్తున్న గిరిజన సంఘాల నాయకులు

సీతంపేట: గిరిజన సంఘాలతో సమన్వయ సమావేశం నిర్వహించాలని గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిడ్డిక తేజేశ్వరరావు కోరారు. ఈ మేరకు స్థానిక ఐటీడీఏలో ఇన్‌చార్జ్ పీఓ పవార్ స్వప్నిల్ జగన్నాథ్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని, నిరుద్యోగ గిరిజన యువతకు ఉపాధి కల్పించాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్.లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, తులసయ్య పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కొమరాడ: పౌష్టికాహారంతో తల్లీబిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని విక్రంపురం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పి.బంగారమ్మ అన్నారు. విక్రంపురం సెక్టార్‌లో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఆకుకూరలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు కళింగ మల్లేశ్వరరావు, వైస్ సర్పంచ్ సిరిపురం రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

108 కలశాలతో పవిత్ర జలాలు..



భామిని మండలంలోని బత్తిలి కోటదుర్గమ్మ సన్నిధిలో అమ్మవారిని అభిషేకించడానికి 108 కలశాలతో పవిత్ర జలాలు తీసుకువచ్చారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కలశాలను ఊరేగించి, మంటపం వద్ద శివలింగాకారంలో ఏర్పాటు చేశారు. దసరా రోజున ఈ జలాలతో అమ్మవారిని అభిషేకిస్తామని నిర్వాహకులు తెలిపారు.

– భామిని

క్యాబేజీ పువ్వుతో కాసుల పంట..



మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధం చేస్తున్న పువ్వులు



వీరఘట్టంలో సాగులో ఉన్న కాలీఫ్లవర్

- సంక్రాంతి వరకు అందుబాటులో
- గతేడాది కంటే రెండింతలు పెరిగిన ధర
- మండల వ్యాప్తంగా 450 ఎకరాల్లో పంటసాగు
- ఉత్తరాంధ్ర జిల్లాలకు ఎగుమతి చేస్తున్న కాలీఫ్లవర్

వీరఘట్టం:

క్యాబేజీ పువ్వుల సీజన్ మొదలైందంటే కూరగాయల రైతుల ఇంట కాసుల వర్షం కురిసినట్లే. పంట తొలి సీజన్‌లో ఎంతో గిరాకీ ఉండడంతో క్యాబేజీ సాగు చేసిన రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు. ప్రస్తుతం సాగుచేస్తున్నది దేశివాళీ పంట కావడంతో డిమాండ్ నెలకొంది. ఇటీవల కురిసిన వర్షాలకు పచ్చిమిర్చి, వంగ, తదితర పంటలకు కాస్త నష్టం ఏర్పడినప్పటికీ, క్యాబేజీకి మాత్రం మేలే చేకూరింది. వర్షాలకు మంచి దిగుబడులు రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది ధర అధికంగా ఉందని రైతులు చెబుతున్నారు.

చాలా గిరాకీ..

ఉత్తరాంధ్ర పరిధిలో వీరఘట్టం మండలంలో పండిస్తున్న క్యాబేజీకి చాలా డిమాండ్ ఉంది. ప్రస్తుతం మండల వ్యాప్తంగా వీరఘట్టం, బూరుగ, కొట్టుగుమ్మడ, దశుమంతుపురం, కంబర, చిదిమి, తదితర గ్రామాల్లో ఈ ఏడాది సుమారు 450 ఎకరాల్లో కాలీఫ్లవర్ (క్యాబేజీ పువ్వు) పంటను సాగు చేస్తున్నారు. ఆగస్టు మొదటి వారం నుంచి విడతల వారీగా వేసిన ఈ పంట ప్రస్తుతం 80 ఎకరాల్లో కోత దశకు వచ్చింది.అక్టోబర్ నెలాఖరుకు పూర్తి స్థాయిలో పంట దిగుబడి వస్తుందని రైతులు అంటున్నారు.

మూడింతల లాభం....

గతేడాది ఎకరానికి 3 వేల నుంచి 4 వేల పువ్వుల వరకు దిగుబడి వచ్చేది. గత సంవత్సరం ఒక్కో పువ్వు ధర రూ.10 పలకగా.. దిగుబడి ఆశించిన స్థాయిలో లేకపోవడంతో అరకొర లాభాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ ఏడాది ధర, దిగుబడి అన్నీ కలిసిరావడంతో మూడింతల లాభం చేతికొస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి అన్ని విధాలుగా మదుపు కింద రూ. 30 వేల వరకు ఖర్చు చేస్తారు. అయితే ఎకరా విస్తీర్ణానికి సుమారు ఏడు వేల నుంచి ఎనిమిది వేల వరకు పువ్వులు చేతికొస్తున్నాయి. ఒక్కో పువ్వు ధర రూ. 20 పలుకుతుండగా.. ఈ లెక్కన ఎకరాకు సుమారు లక్షన్నర రూపాయల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందని అన్నదాతలు చెబుతున్నారు.

ఇతర ప్రాంతాలకు తరలింపు ..

రైతుల వద్ద కొనుగోలు చేస్తున్న వ్యాపారులు ఇప్పటికే శ్రీకాకుళం, పార్వతీపురం, విశాఖపట్నం, ఒడిశా వంటి ప్రాంతాలకు పువ్వులు ఎగుమతి చేస్తున్నారు. ప్రస్తుతం సీజన్ కావడంతో అన్ని చోట్లా డిమాండ్ ఉండడంతో వ్యాపారులు కూడా లాభపడుతున్నారు. వారం రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు.

ఆశాజనకంగా ఉంది..



మూడెకరాల విస్తీర్ణంలో ఈ ఏడాది క్యాబేజీ పంట వేశాం. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది దిగుబడి బాగా వచ్చే అవకాశం ఉంది. మార్కెట్‌లో ధర బాగుండడంతో మంచి లాభాలు ఆర్జించే అవకాశం ఉంది. బరంపురం మార్కెట్‌కు ప్రతి రోజూ కాలీఫ్లవర్ పంటను తరలిస్తున్నాం.

– కర్రి తిరుమల, కూరగాయల రైతు, వీరఘట్టం

చలిగాలి పెరిగితే మరింత లాభం..



ప్రస్తుతం పంట బాగున్నప్పటికీ చలిగాలి వేస్తే పువ్వు సైజు పెద్దదిగా మారుతుంది. దీంతో ధర మరింత పెరిగే అవకాశం ఉంది. అరెకరా విస్తీర్ణంలో పంట సాగు చేస్తున్నాను. దిగుబడి బాగానే ఉంది. పది కిలోల క్యాబేజీ పువ్వులను హోల్‌సేల్‌గా రూ.300లకు విక్రయిస్తున్నాం. మార్కెట్‌లో వీటిని అమ్మితే 450 రూపాయల వరకు వస్తుంది.

– కర్రి నాగరాజు, కూరగాయల రైతు, వీరఘట్టం

ప్రజలతో కలిసి ఉద్యమిస్తాం..

- వైఎస్సార్‌సీపీ నాయకులు



సమస్యను మీడియాకు వివరిస్తున్న ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

పాలకొండ రూరల్: పట్టణంలోని సేకరించిన చెత్తను పాలకొండ – ఓని రహదారిలో గల బత్తులవాని చెరువు, పరిసర ప్రాంతాల్లో డంప్ చేయడాన్ని నగర అధికారులు విరమించుకోవాలని, లేనిపక్షంలో బాధిత ప్రజలతో ఉద్యమిస్తానని వైస్ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కణపాక సూర్యప్రకాష్ స్పష్టం చేశారు. తాత్కాలిక డంపింగ్ యార్డు వద్దకు శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు చేరుకుని చెరువులో చెత్త వేయకుండా అడ్డుకున్నారు. వైస్ ఎంపీపీ సూర్యప్రకాష్, సర్పంచ్‌ల సంఘ మండల ఉపాధ్యక్షుడు తిర్లంగి ఉపేంద్రకుమార్ మాట్లాడుతూ.. పట్టణంలో సేకరించిన చెత్తను బత్తులవాని చెరువు, పరిసర ప్రాంతాల్లో వేస్తున్నారు. పైగా చెత్తకు నిప్పు పెడుతుండడంతో పొగ, దుర్వాసనతో స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. అధికారులు స్పందించి చెత్త డంపింగ్‌ను వేరే ప్రాంతానికి తరలించాలని, లేనిపక్షంలో ఉద్యమం చేపట్టక తప్పదన్నారు.

విశ్రాంత భవనం ప్రారంభం



ప్రారంభమైన విశ్రాంతి భవనం వద్ద ప్రజా ప్రతినిధులు, సీఐటీయూ, భవననిర్మాణ సంఘ నాయకులు

పాలకొండ రూరల్: మండలంలోని గొట్ట మంగళాపురం గ్రామంలో నిర్మించిన విశ్రాంతి భవనాన్ని సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కరణం బాబ్జీ మాస్టారు శుక్రవారం ప్రారంభించారు. భవన నిర్మాణ కార్మికుల (సీఐటీయూ) కృషితో దాదాపు 77 మంది దాతల సహకారంతో ఈ భవనం నిర్మించామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి. వెంకటరమణ, విద్యా కమిటీ చైర్మన్ జి.రవికుమా ర్, భవన నిర్మాణ కార్మిక సంఘ అధ్యక్షుడు మజ్జి వీరన్నాయుడు, బబ్బాది శివ, గ్రామస్తులు పాల్గొన్నారు.

మారిషస్ పైనాపిల్‌తో అధిక ఆదాయం

- ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ పవార్ స్వప్నిల్ జగన్నాథ్



మారిషస్ పైనాపిల్ సాగును పరిశీలిస్తున్న పీఓ

సీతంపేట: మారిషస్ పైనాపిల్‌తో అధిక ఆదాయం పొందవచ్చని పాలకొండ సబ్ కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ తెలిపారు. మండలంలోని బిల్లగూడ, ఇప్పగూడలో సాగులో ఉన్న మారిషస్ పైనాపిల్ మొక్కలను, స్థానిక హెచ్‌ఎన్‌టీసీ నర్సరీని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. పంటల సాగు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. జీడి, మామిడి పునరుద్ధరణ పథకంలో భాగంగా జీడి, మామిడి సాగు ద్వారా అధిక ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. భామిని మండలం పాలిష్‌కోట, నల్లరాయిగూడ, మనుమకొండ.. సీతంపేట మండలం కీసరజోడు, బిల్లగూడ, ఈతమానుగూడలలో జీడిమామిడిని ప్రయోగాత్మకంగా సాగుచేయనున్నట్లు చెప్పారు. అలాగే మారిషస్ పైనాపిల్ సాగును కూడా ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పీహెచ్‌ఓ ఎస్‌వీ గణేష్, హెచ్‌ఓ పేడాడ జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల ఉత్పత్తులు ఎంతో మేలు

- డీఆర్‌డీఏ పీడీ సుధారాణి



చిరుధాన్యాల ఉత్పత్తులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ సుధారాణి

గుమ్మలక్ష్మీపురం: చిరుధాన్యాల ఉత్పత్తులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ సుధారాణి పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని మండ గ్రామానికి చెందిన డ్వాక్రా సంఘ సభ్యురాలు శాంతి ఉన్నతి పథకం ద్వారా పొందిన రుణంతో మండ జంక్షన్ వద్ద నెలకొల్పిన చిరుధాన్యాల ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. డీఆర్‌డీఏ ద్వారా జిల్లాలో 25 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.అలాగే గుమ్మలక్ష్మీపురంలో త్వరలో మహిళా మార్ట్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈమె వెంట డీపీఎం శ్రీనివాస్, గుమ్మలక్ష్మీపురం ఏపీఎం సతీష్, సీసీలు, ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

బయో రిసోర్స్‌సెంటర్లను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న డీపీఎం శ్రావణ్‌కుమార్ నాయుడు

గరుగుబిల్లి: బయో రిసోర్స్‌సెంటర్లను బలోపేతం చేయాలని ప్రకృతి వ్యవసాయ ప్రబంధకుడు ఎం. శ్రావణ్‌కుమార్‌నాయుడు అన్నారు. మండలంలోని తోటపల్లి జట్టు ట్రస్టులో బయోరిసోర్స్ సెంటర్ల యజమానులతో శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ఎన్‌పీఎం షాపులలో అన్ని రకాల కషాయాలు, ద్రావణాలు, కూరగాయల విత్తనాలు, నవ ధాన్యాల విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. పంటలకు తెగుళ్లు సోకిన వెంటనే సస్యరక్షణ చేపట్టేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌వైఎస్‌ఎస్ కన్సల్టెంట్ ప్రవీణ్‌కుమార్, కిరణ్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణ వ్యాఖ్యలు బాధాకరం..



గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొమరాడ: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై నిండు సభలో ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు బాధాకరమని వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు నంగిరెడ్డి శరత్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు కళింగి మల్లేశ్వరరావు అన్నారు. ఈ మేరకు మండలంలోని విక్రమపురంలో ఉన్న గాంధీ విగ్రహానికి శుక్రవారం వినతిపత్రం అందజేసి, అనంతరం నిరసన వ్యక్తం చేశారు. బాలకృష్ణ అధికారమదంతో మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. అటువంటి వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

- మాజీ ఎమ్మెల్యే కళావతి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని కుమ్మరిగండి గ్రామంలో శుక్రవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.13 కోట్లతో రహదారులు మంజూరయ్యాయన్నారు. ఆ రోడ్లను కూటమి ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. చేసిన పనులకు సైతం పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించడం లేదని ఆరోపించారు. అలాగే కొత్త రహదారులు సైతం మంజూరు చేయడం లేదన్నారు. పాడైన రహదారులకు మరమ్మతులు చేపట్టకపోవడంతో కొన్ని రోడ్లపై నడవలేని పరిస్థితులున్నాయని చెప్పారు. కనీసం 108, ఐటీడీఏ అంబులెన్స్‌లు కూడా వెళ్లలేకపోవడంతో గిరిజనులు అత్యవసర సమయంలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వరద గోడలు నిర్మించకపోవడంతో కొండలపై నుంచి వచ్చే వరదనీరు వెళ్లి ఇళ్లలోకి చేరుతోందన్నారు. ఎండీయూ వాహనాలు తీసివేయడంతో రేషన్ కోసం ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. వలంటీర్ వ్యవస్థ లేకపోవడంతో వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం లబ్ధిదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం స్పందించి గిరిజన ప్రాంత అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్టీ సెల్ కన్వీనర్ హెచ్.మోహన్‌రావు, నియోజకవర్గ ఎస్టీ సెల్ కన్వీనర్ నిమ్మక కాంతారావు, సర్పంచ్‌లు వెంకునాయుడు, ఎన్.తిరుపతిరావు, ఎంపీటీసీ సభ్యులు ఎస్.చంద్రశేఖర్, కోటేశ్వరరావు, పార్టీ నాయకులు ఎస్.మహేష్, సింహాచలం , ఎన్.అబ్బాస్, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

రెండోసారి కాంప్లెక్స్ ఎరువులు వేయకూడదు

గరుగుబిల్లి: ఖరీఫ్‌లో వరిపంటలో రెండో విడత కాంప్లెక్స్ ఎరువులు వేయకూడదని మండల వ్యవసాయాధికారి టి.జ్యోత్స్న అన్నారు. మండలంలోని గరుగుబిల్లి, పెద్దూరు, గొట్టివలస, తదితర గ్రామాల్లోని వరి పంట పొలాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎరువులు, పురుగు మందులను విచక్షణారహితంగా వినియోగిస్తే తెగుళ్లు సోకే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా రెండోసారి భాస్వరం ఎరువు వేయకూడదని సూచించారు. అలాగే మోతాదుకు మించి యూరియా వినియోగించకూడదన్నారు.

దుర్గమ్మకు వినతి..



పాలకొండను జిల్లా కేంద్రంగా చేయాలని, లేని పక్షంలో శ్రీకాకుళం జిల్లాలో కొనసాగించేలా పాలకులకు బుద్ధి కల్పించాలని కోరుతూ సాధన సమితి నాయకులు కోటదుర్గమ్మకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చౌదరినాయుడు, వండా కూర్మారావు, బుడితి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

– పాలకొండ

జయహో.. దుర్గాభవానీ



గుమ్మలక్ష్మీపురం: భద్రగిరి రామాలయంలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు



వీరఘట్టం: దుర్గమ్మ మంటపం వద్ద భజనలు చేస్తున్న భక్తులు



జియ్యమ్మవలస రూరల్: గౌరీపురంలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు



కురుపాం: మహాలక్ష్మీదేవి అవతారంలో దుర్గాదేవి

దసరా శరన్నవరాత్రుల సందర్భంగా వాడవాడలా దేవీ పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వీరఘట్టంలో ప్రముఖ యజ్ఞకర్త శర్మయాజీ ఆధ్వర్యంలో మహిళలు శుక్రవారం సామూహిక కుంకుమ పూజలు చేపట్టారు. అలాగే సాయంత్రం భవానీ భక్తులు భజనలు చేశారు. గుమ్మలక్ష్మీపురం మండలం భద్రగిరి రామాలయంలో అర్చకుడు మనోజ్ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు నిర్వహించారు. కురుపాం మండలం రావాడ కూడలి వద్ద అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే జియ్యమ్మవలసలో కూడా ప్రత్యేక పూజలు జరిగాయి.

– వీరఘట్టం/గుమ్మలక్ష్మీపురం/కురుపాం/జియ్యమ్మవలస రూరల్

మెట్టవలసలో మంచినీటి కష్టాలు

- పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా ఉన్న రక్షిత మంచినీటి పథకం ట్యాంక్



ద్విచక్ర వాహనంపై ప్లాస్టిక్ క్యానుల్లో మంచినీరు తెచ్చుకుంటున్న దృశ్యం

పాచిపెంట: గిరిజనమంత్రి ఇలాకాలో గిరిజనులకు మంచినీటి కష్టాలు తప్పడం లేదు. గిరిజన ప్రాంతంలో తాగునీటి సమస్య పరిష్కరించడానికి ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నామని చెబుతున్నప్పటికీ, శాశ్వతంగా నీటి సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు, గుక్కెడు నీటి కోసం గిరి గ్రామాల ప్రజలకు పుట్టెడు కష్టాలు తప్పడం లేదు. బిందెడు నీటి కోసం మైళ్ల దూరం నడిచి వెళ్తున్నారు. కాలమేదైనా వారికి నీటి కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. పాచిపెంట మండలంలోని పెద్దవలస పంచాయతీ మెట్టవలస గ్రామానికి నెల రోజులుగా రక్షిత మంచినీటి సరఫరా నిలిచిపోయింది. ఉన్న ఒక్క చేతిపంపులో నుంచి ఉప్పునీరు కావడంతో వినియోగానికి పనికి రావడం లేదు. రక్షిత మంచినీటి ట్యాంకుకు నీళ్లు రావడంలేదని, పలుమార్లు అధికారులకు తెలియజేసినప్పటికీ పట్టించుకోవడం లేదు, చేసేదేమీ లేక సుమారు రెండు కిలోమీటర్లు నడిచి వెళ్లి బిందెలతో మంచినీళ్లు తెచ్చుకుంటున్నారు. మరికొందరైతే తమ ద్విచక్ర వాహనాలకు ప్లాస్టిక్ క్యాన్లు ఇరువైపులా కట్టుకుని నీళ్లు తెచ్చుకునే పరిస్థితి, మంచి నీటి కోసం అవస్థలు పడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై గిరిజన ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మంచినీటి కష్టాలు తీర్చేలా మండల అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని గిరిజన ప్రజలు కోరుకుంటున్నారు.